# రక్తం త్రాగే పిశాచం

వసుంధర




(గత సంచిక తరువాయి)

తనకు రానున్న అమానుష శక్తులపై ఎన్నో ఆశలు పెట్టుకొంది వకుళ.

అగడమే మంచిదనుకొన్నాడు కోదండం. అందుకే-

"ఎన్నాళ్ళు?" అనడిగాడు.

"నెల్లాళ్ళు...." అంది వకుళ.

"అప్పుడు...."

"అంత కాలం నాతో స్నేహంగా వుండగలిగితే నా మొదటి ప్రయోగం నీమీద నే!" అంది వకుళ.

"ప్రయోగమా - అంటే?" అనడిగాడు కోదండం ఆశ్చర్యంగా.

"అందమైన ఆడపిల్ల ఇష్టపడ్డ స్నేహితుడిపై చేసే ప్రయోగం ఏమిటో తెలుసుకోలేవూ?"

ఊహించగానే ఏదో ఆనందం కలిగింది కోదండానికి. ఊహాలో పరవశిస్తూ అతడు రోజులు గడుపుతున్నాడు.

వకుళ రోజులు లెక్కపెట్టుకొంటోంది.

జపం చేయాల్సిన ఆఖరు అమావాస్య సరిగ్గా ఇంక నాలుగురోజులుంది.

ఇంతవరకూ అన్నీ సవ్యంగా అయిపోయాయి. ఇది కూడా సవ్యంగా అయిపోతే.... అప్పుడు ....

## 6

ప్రొఫెసర్ మహాదేవుడు కుర్చీలో కూర్చొని చేతి గడియారం వంకనే చూస్తూ — "మిస్టర్ లింగం! సొల్యూషన్ రంగు మారిందా?" అనడిగాడు.

"ఇంకా లేదండి-" అరిచాడు లింగం.

"ఈపాటికి రంగు మారాలే...." అని మనసులో గొణుక్కొని-"స్టాప్ వాచి వుపయోగించు. సరిగ్గా ఎంత సేపటికి రంగు మారిందో సెకన్లతోసహా చెప్పాలి-" అంటూ అరిచాడు మహాదేవుడు.

"ఆ ఏర్పాట్లన్నీ ముందే చేశాను సార్!" అన్నాడు లింగం.

మహాదేవుడు లింగం మాటలు వినలేదు. ప్రయోగం గురించి గంభీరంగా ఆలోచిస్తున్నాడు. ఆయన ఆలోచనల్లో వుండగానే కాలింగ్ బెల్ మ్రోగింది.

ఇంటి పనివాడు వెళ్ళి తలుపు తీశాడు.

"ప్రొఫెసర్ గారున్నారా?"

"వున్నారు. మీరెవరు?"

"నా పేరు భీమారావు. జర్నలిస్టును. ఆయన్ను కలుసుకోగోరుతున్నాను-" అన్నాడతను.

పనివాడు భీమారావును వేరే గదిలో కూర్చోబెట్టి మహాదేవుడుకి చెప్పాడు. తనలో తనే ఏదో గొణుక్కొంటూ మహాదేవుడు ఆ గదిలోకి వెళ్ళాడు.

భీమారావు లేచి నిలబడి-"నమస్కారం సార్!" అన్నాడు.

"కూర్చో!" అన్నాడు మహాదేవుడు. ఇద్దరూ కూర్చున్నారు.

"మీరు వుద్యోగానికి రాజీనామా ఇచ్చారని తెలిసింది. కారణం తెలుసుకోవచ్చా?" అనడిగాడు భీమారావు.

"చాలా సింపుల్. నేను చేయాలనుకున్న పరిశోధనలకు వాళ్ళొప్పుకోలేదు. అవి కొనసాగించడం నా జీవన ధ్యేయం. అందుకే ఉద్యోగం వదిలిపెట్టి ఇంట్లో పరిశోధనలు మొదలెట్టాను. డబ్బుకు నా కెప్పుడూ ఇబ్బంది లేదు."

"ఇలా అడుగుతున్నానని ఏమీ అనుకోకండి సార్! ఇప్పుడు ఇండియాలో సైంటిఫిక్ అడ్మినిస్ట్రేషన్ చాలా ఘోరంగా ఉంటోంది. టాప్ లెవెల్లో వున్నవాళ్ళు మిగతా వాళ్ళను పైకిరాకుండా అణచివేయడానికి ప్రయ

త్నిస్తున్నారని అంతా చెప్పుకుంటున్నదే! మీ రాజీనామా అలాంటికే సేనని నా నమ్మకం. మీ ఉదాహారణలో ఓ వ్యాసం రాశానంటే మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అదిరిపోవాలి" అన్నాడు భీమారావు.

"అచ్చే అదేంలేదు. నాకు పై అధికార్లతో గొడవలు లేవు. మా రిలేషన్స్ చక్కగా వున్నాయి. అయితే ప్రతి సంస్థకూ కొన్ని పరిమితులుంటాయి. ఆ పరిమితులకు లోబడి పని చేయాలి మేము. నీనెన్నుకున్న పరిశోధన ఆ సంస్థ పరిమితిలో లేదు. ఇందులో యెవరినీ అపార్థం చేసుకో కూడదు. అనవసరపు రాజకీయాలు నాకు గిట్టవు. కాబట్టి నిన్ను నిరుత్సాహపరుస్తున్నాననే చెప్పాలి!" అన్నాడు మహాదేవుడు.

"వ్వోవ్వోవ్వో-నా టోటాల్ సార్! మీరు చెప్పింది వినగానే నా ఉత్సాహం పెరిగింది. ఉద్యోగం కూడా వదిలి కొనసాగిస్తున్న ఆ పరిశోధన ఏమిటో తెలుసుకోవాలని నేనాత్రపడుతున్నాను" అన్నాడు భీమారావు.

"ఒక్క మాటలో చెప్పాలంటే చచ్చిన వాళ్లను బ్రతికించడానికి ప్రయత్నిస్తున్నాను" అన్నాడు మహాదేవుడు తాపీగా.

"చచ్చినవాళ్ళను బ్రతికించడమా? అది సాధ్యమా?" ఆశ్చర్యంగా అడిగాడు భీమారావు.

"సాధ్యం కావచ్చునని నా తొలిప్రయోగాలు సూచించాయి. అందుకే పరిశోధనలు కొనసాగిస్తున్నాను. నా అసిస్టెంట్ లింగం అహోరాత్రాలూ శ్రమపడుతున్నాడు నా పరిశోధనలకోసం!" అన్నాడు మహాదేవుడు.

"సార్-చిన్న సందేహం-మీరు చచ్చిన మనుషుల్ని బ్రతికించుకుంటూపోతే ఈ ప్రపంచం ఏమైపోతుంది?

మరో సైంటిస్టెవడో-ఇక మనుషులు పుట్టకుండా చేయాలి అంతేనా?" అన్నాడు భీమారావు.

ఇలాంటి ప్రశ్న భీమారావు ముందే వేస్తాడని ఊహించినట్లుగా నవ్వాడు మహాదేవుడు. కానీ ఆయన వెంటనే మాట్లాడలేదు. ఒక్క నిమిషం ఆగి "ఈ మాత్రం ఆలోచన నాకు తట్టలేదనుకోకు. కానీ నా పరిశోధన నువ్వనుకుంటున్న వైపు కాదు. నేను చనిపోయిన వారికి ప్రాణం పోస్తానని అనడంలేదు. అండర్‌స్టాండ్!" అన్నాడు.

ఇప్పుడు భీమారావుకి నిజంగా ఏమీ అర్థంకాలేదు. చచ్చినవాళ్లని బ్రతికిస్తానంటాడు. పోయిన వాళ్ళకి ప్రాణం పోయలేదంటాడు. రెండూ యెలా సాధ్యం?

తన సందేహాన్ని భీమారావు సూటిగానే అడిగేశాడు.

మహాదేవుడు మళ్ళీ నవ్వాడు "నేననుకున్న ప్రశ్నే వేశావు. మీ జర్నలిస్టులకు కాకమ్మ కథలల్లడమే కానీ మేధావులతో మాట్లాడ్డం చేతకాదు. నీకిప్పుడు కొన్ని ఉదాహరణ లిస్తాను. అర్థంచేసుకుందుకు ప్రయత్నించు."

ప్రొఫెసర్ మహాదేవుడిచ్చిన మూడు ఉదాహరణలూ ఇవి.

పెట్రోల్ లేక కారు ఆగిపోతుంది. దగ్గర్లోనే పెట్రోల్ బంక్ వుంటే కారును కాస్త తోసి మళ్ళీ కొంత దూరం నడపవచ్చును. ఆ తోయడంలో టాంక్ అడుగున వున్న పెట్రోల్ యెలాగో ఇంజన్‌ని ప్రవేశించి కారు మళ్ళీ స్టార్టవుతుంది.

సిలిండర్లో గ్యాస్ అయిపోతుంది. స్టవ్ వెలగదు. కాసేపు ఓపికగా సిలిండర్‌ను కదుపుతూ కూర్చుంటే మళ్ళీ స్టవ్ వెలిగించవచ్చు.

రేడియోలో బ్యాటరీ అయిపోతుంది. బ్యాటరీని కాసేపు అటుమార్చి ఇటుమార్చి కుదిపి, కదిపి మళ్ళీ రేడియోలో వేస్తే కొంత సేపు రేడియో పని చేస్తుంది.

"మూడు ఉదాహరణలూ నిత్యజీవితంలో అందరికీ యెదురయ్యేవే! మూడూ కూడా శక్తికి సంబంధించినవే! ఒకటి కారును నడిపించేశక్తి, రెండవది స్టవ్‌ను వెలిగించే శక్తి, మూడవది రేడియోను పలికించే శక్తి! మనిషి కూడా ఈ మూడు శక్తుల కలయిక. చలనం, తేజం, శబ్దం! ఈ మూడు శక్తులూ హఠాత్తుగా ఆగిపోతే వాటిని పునరుద్ధరించడం నా ఉద్దేశం" అని ఆగాడు మహాదేవుడు.

"అంటే అది మనిషికి ప్రాణం పోయడమే అవుతుంది కదా!" అన్నాడు భీమారావు.

"అందుకే నువ్వు జర్నలిస్టుగా వుండిపోయావు. నేను సైంటిస్టునయ్యాను" అని నవ్వాడు మహాదేవుడు. "నేను చెప్పిన మూడు ఉదాహరణల్లో కూడా శాశ్వత పరిష్కారం లేదు. ప్రాణంపోయడం ప్రసక్తి లేదు. ఆగిపోయిన కారు టాంక్‌లో పెట్రోల్ పోస్తేనే అది ప్రాణం పోయడం అవుతుంది. సిలిండర్‌ని మళ్ళీ గ్యాస్‌తో నింపితేనే అది గ్యాస్ స్టవ్‌కు శాశ్వత పరిష్కారం. రేడియోను జెడదలేకుండా వినాలంటే అయిపోయిన బ్యాటరీలు తీసేసి కొత్త బ్యాటరీలు వేయాలి. కానీ నేను చూస్తున్నది శాశ్వతపరిష్కారం కాదు. తాత్కాలిక పరిష్కారం. అంటే ఒకసారి చచ్చిపోయి నా కారణంగా బ్రతికిన మనిషి మళ్ళీ నూరేళ్ళు జీవించడు. అతడి అదృష్టాన్నిబట్టి గంటలో, రోజులో, నెలలో జీవిస్తాడు...."

"ఇందువల్ల మీరు సాధించదల్చుకున్నదేమిటి?"

"సామాన్యమానవులకున్న ప్రయోజనాలేమిటంటే— చెప్పాలనుకుని మర్చిపోయినవేమైనా ఉంటే మనిషి వాటిని చెప్పుకుందుకు అవకాశం లభిస్తుంది. నాకు సంబంధించినంతవరకూ ఒక అపూర్వప్రయోజనాన్నాశిస్తున్నాను" అని ఆగాడు మహాదేవుడు. భీమారావు తన వంక ఆత్రుతగా చూడడం చూసి తృప్తిగా నిట్టూర్చాడాయన. "అదేమిటంటే-మరణానంతరం ఏమయిందో తెలుసుకునే అవకాశం కూడా వుంది!"

భీమారావు శరీరంపై రోమాలు నిక్కబొడుచుకున్నాయి "ఎలా?" అన్నాడు అప్రయత్నంగా.

"ఒక ఎక్స్ చచ్చిపోయాడనుకో. అప్పుడు టైము పదయిందనుకో. నేను ఎక్స్‌ని పదకొండింటికి బ్రతికించాననుకో. పది నుంచి పదకొండు దాకా ఎక్స్ యెలాంటి అనుభూతులు చెందాడు? అతడి అనుభవాలేమిటి? ఇలాంటివి తెలుసుకోగలిగితే ఈ సృష్టికి సంబంధించిన అసలు రహస్యం దొరికినట్లే గదా!" అన్నాడు మహాదేవుడు.

"అవుననుకోండి. కానీ చచ్చిబ్రతికిన మనుషుల కథలు కొన్ని నాకూ తెలుసు. అవి ఒకదానికీ ఒకదానికీ పొసగవు" అన్నాడు భీమారావు.

"మనకేసు అలాంటిది కాదు. వందలకొద్దీ జనాన్ని పరిశోధిస్తాం. అంతమందిపై జరిపిన పరిశోధనలలో కొన్ని పోలికలు బయటపడక తప్పదు" అన్నాడు మహాదేవుడు కచ్చితంగా.

"మీ పరిశోధనలే గనుక ఫలిస్తే సృష్టిలో సంచలనం రేగుతుంది" అన్నాడు భీమారావు.

"నీ జర్నలిస్టు బుద్ధి పోనిచ్చుకున్నావు కాదు. సంచ

లనం రేపడం నా ప్రధానోద్దేశ్యం కాదు. సృష్టిని తెలుసుకోవాలన్నది నా కోరిక."

"ఎంతకాలంలో మీ పరిశోధన ఒకదారికి వస్తుందంటారు?" అడిగాడు భీమారావు.

"ఈ రోజుకు అమావాస్య సరిగ్గా నాలుగు రోజులుంది. ఆపై అమావాస్యకు ఇంజక్షన్ తయారుచేయాలన్నది నా కోరిక" అన్నాడు మహాదేవుడు.

"అమావాస్య మంచి తిథి కాదు" అన్నాడు భీమారావు.

"అందుకే నేను దాన్ని ప్రత్యేకంగా ఎన్నుకున్నాను. సైంటిఫిక్‌గా కూడా అమావాస్యకూ, మనిషి చావుకూ కొన్ని కనెక్షన్సున్నాయి- ఈ విషయం నా పరిశోధనల వల్ల తేలింది" అన్నాడు మహాదేవుడు.

భీమారావు లేచి నిలబడి "మీకు చాలా శ్రమ ఇచ్చాను" అని సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు.

"నాకు శ్రమలేదు. నువ్వు మరికాసేపు కూర్చోగలిగితే సంతోషిస్తాను"అన్నాడు మహాదేవుడు. "నా అసిస్టెంట్ ప్రయోగం మధ్యలో ఉన్నాడు. ఫలితంకోసం ఆత్రుతగా యెదురు చూస్తున్నాను. టైమ్ కిల్లింగ్‌కు నువ్వు బాగానే దొరికావు. నా కింకా అతడి నుంచి పిలుపు రాలేదు."

"నేను వెళ్ళకతప్పదు సార్!" అంటూ భీమారావు లేచి సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

మహాదేవుడు లోపలకు వెళ్ళి "లింగం ఇంకా రంగు మారలేదా?" అనడిగాడు.

"లేదుసార్!" అన్నాడు లింగం.

(ఇంకా వుంది)